క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం

మధిర: మధిర చెరుకుపల్లి వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి కలయిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇరుకుళ్ల బాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు శుక్రవారం రూ.20వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గొండేల సూర్యప్రకాశరావు మాట్లాడుతూ.. స్వామివారి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమానికి కలయిక వాకర్స్ క్లబ్ వారు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు వితరణ



ప్యాడ్లు, పెన్నులు అందిస్తున్న సభ్యులు

మధిర: మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు శ్రీ సత్యసాయి సేవా సమితి ఖమ్మం వారి ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఖమ్మం అధ్యక్షుడు సుధాకర్ రావు, మధిర మండల ఇన్‌చార్జ్ కోనా మోహన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని కోరారు. మండలంలో అనేక పాఠశాలల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యరమల కోటారెడ్డి, ఈ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కోలాట పోటీలు

వేంసూరు: మండల పరిధిలోని కందుకూరు వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన కోలాటం పోటీలు నిర్వహించారు. అనంతరం రాయాంజనేయ కోలాట బృందం మొదటి బహుమతి గెలుచుకోగా.. రెండో బహుమతి శ్రీ రామాంజనేయ బృందం గెలుచుకుంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖాధికారి రాయల ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదర్భంగా అన్నారుగూడెం, గోపాలపేట, నరసింహారావుపేట, లక్ష్మీనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాము కాటుకు గురైన రైతు

చింతకాని: చింతకాని గ్రామానికి చెందిన దరిపల్లి వెంకటేశ్వర్లు రైతు శుక్రవారం పాము కాటుకు గురయ్యాడు. వెంకటేశ్వర్లు తన వరి పొలంలో ఎరువులు చల్లుతుండగా పాము కరిచింది. అతని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు మెరుగైన చికిత్స కోసం 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కార్ల్‌మార్క్స్ వర్ధంతి



కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం కార్ల్‌మార్క్స్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ నివాళి అర్పించారు. సమాజానికి కార్ల్‌మార్క్స్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బసవయ్య, వెంకట్రామయ్య, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి సినిమాకు ఆదరణ

తల్లాడ: దేశభక్తి గల చావా సినిమాకు తల్లాడలో మంచి ఆదరణ లభిస్తోంది. బీజేపీ నాయకుల ప్రోత్సాహంతో ఆ సినిమాను ఓ వీది వారు మొత్త గురువారం రాత్రి తిలకించారు. స్థానిక గౌడబజారుకు మహిళలు, పురుషులు చావా సినిమాను తిలకించారు. శివాజీ మహారాజ్ తనయుడు శంభాజీ చరిత్ర కన్నులకు కట్టినట్లుగా కథ ఉందన్నారు. చిత్రాన్ని ప్రేరేపించి చూపించిన వారిలో బీజేపీ నాయకులు పెరికె కిరణ్, గాదె కృష్ణారావు, తమ్మిశెట్టి కృష్ణ, చల్లా నరేష్, వాడవల్లి నాగేశ్వర్‌రావు, సమ్మెట రాంబాబు ఉన్నారు.

రంగు రబ్బా రబ్బా..



ఘనంగా హోలీ వేడుకలు

హోలీ వేడుకలను యువకులు, పిల్లలు, మహిళలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని పురవీధుల్లో తిరుగుతూ కేరింతలు కొడుతూ రంగులు చల్లుకున్నారు. కుల, మతాలకు అతీతంగా హోలీ వేడుకలను జరుపుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పలు ఆలయాల్లో స్వామివార్లకు అభిషేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్





తల్లాడలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు, మహిళలు



మధిర: హోలీ వేడుకల్లో మధిర స్విమ్మర్లు



సత్తుపల్లిటౌన్: బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో..



ముదిగొండలో..



ఏన్కూరులో..



కొణిజర్ల: తనికెళ్లలో..



సత్తుపల్లిరూరల్: హోలీ ఆడుతున్న ఏసీపీ రఘు, సీఐ కిరణ్, పోలీసులు



వైరాలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



తల్లాడ: మల్లూర్ తండాలో రంగులు చల్లుకుంటున్న గిరిజనులు



ఎర్రుపాలెం: జమలాపురంలో..



బోనకల్: హోలీ ఆడుతున్న యువతీ,యువకులు



కారేపల్లి: రంగులు పులుముకొని నృత్యం చేస్తున్న చిన్నారులు



వైరారూరల్: ఖానాపురంలో..



చింతకానిలో..



కొణిజర్ల: రంగులు పూసుకుంటున్న చిన్నారులు



కొణిజర్ల: రాజ్యాతండాలో..



మధిర: రెడ్డి గార్డెన్స్ సమీపంలో పిల్లలతో కలిసి రంగులు చల్లుకుంటున్న వైద్య దంపతులు



చింతకాని: లచ్చగూడెంలో చిన్నారులు

కల్యాణం.. కమనీయం



వేణుగోపాలస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సత్తుపల్లి: పట్టణంలోని జవహర్‌నగర్ శ్రీకృష్ణ మందిరంలో శుక్రవారం శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు రమేష్, వాసు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం..

పట్టణంలోని కాకర్లపల్లిరోడ్‌లో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణం..

చింతకాని: మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయ ఆవరణలో శుక్రవారం రాత్రి శ్రీ భూ, నీలా సమేత శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణాన్ని వేదపండితులు ప్రతాపురం పవన్ కుమారాచార్యులు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, చతుస్థాన అర్చనలు, స్వస్తి పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, నిత్యహోమం, బలిహరణం, పూర్ణాహుతి, స్వామివారి ఎదురుకోళ్ల ఉత్సవం అనంతరం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించగా.. ఆలయ కమిటీ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సీతంపేట గ్రామంలో శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహాస్వామి, కోమట్లగూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ లక్ష్మీ అంకమ్మ తల్లి కల్యాణ మహోత్సవాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు, ఆలయ చైర్మన్లు యండపల్లి శ్రీనివాసరావు, నారగాని శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, వెంకటరమణాచార్యులు, గోపికృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ సిద్దెల నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు పెంచండి

కల్లూరు: మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని ఎండీఎం కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరులో నిర్వహించిన ఎండీఎం ఏజెన్సీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్, కోడిగుడ్లు మెనూ చార్జీలు పెంచాలన్నారు. ప్రతి విద్యార్థికి మెనూ చార్జీ రూ.25కు పెంచాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఎండీఎం కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.10 వేల వేతనం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన పథకానికి రూ.300 కోట్లు కేటాయించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం అమలు, ఉద్యోగ భద్రత, ఏకరూప దుస్తులు, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, ఎండీఎం కార్మికులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



లక్ష్మమ్మ(ఫైల్)

ముదిగొండ: మండలంలోని న్యాలక్ష్మీపురంలో శతాధికవృద్ధురాలు గుర్రం లక్ష్మమ్మ (102) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఇప్పటి వరకు తన పనులు తాను చేసుకుంటూ ఉండేదని, గ్రామంలో అందరినీ ఆప్యాయంగా పలకరించేదని గ్రామస్తులు తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న దయానంద్

వేంసూరు: వేంసూరు, పెనుబల్లి మండలాల సరిహద్దు గ్రామాల మధ్య భీరపల్లి సమీపాన కొలువుదీరిన శ్రీసత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని తీరొక్క పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ప్రారంభించారు.

అంకమ్మ జాతర ప్రారంభం



శ్రీఅంకమ్మ తల్లిని అలంకరించిన దృశ్యం

ముదిగొండ: మండలంలోని కమలాపురంలో శ్రీమహాలక్ష్మి, శ్రీఅంకమ్మ, శ్రీమద్దిరావమ్మ, పెద్దమ్మ, అమ్మవార్ల జాతర శుక్రవారం ప్రారంభమైంది. అయ్యగాపల్లి నుంచి పెద్ద ప్రభతో ఊరేగింపుగా బయలుదేరి అంకమ్మ దేవాలయానికి చేరుకోనుంది. అంకమ్మ దేవాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ నెల 19వరకు జాతర జరగనుంది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న ఎంఈఓ నివేదిత

కల్లూరురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభ్యమౌతుందని కల్లూరు ఎంఈఓ పత్తిపాటి నివేదిత పేర్కొన్నారు. మండలంలోని పెద్దకోరుకొండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పిస్తుందని, ప్రజలు పాఠశాలలపై నమ్మకం ఉంచి విద్యార్థులను చేర్పించాలని కోరారు. కల్లూరు ఎస్సై హరిత మాట్లాడుతూ.. తాము ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించామన్నారు. పెద్దకోరుకొండి పాఠశాల హెచ్ఎం నామ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో చిన్నకోరుకొండి కాంప్లెక్స్ హెచ్ఎం రమణయ్య, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు రాము, వెంకటరమణ, సుందర్, మురళీకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తబృందం చింతల గోవిందరావు, శ్రీనివాసాచారి, రామకోటయ్యచారి, వీరభద్రం, నరేంద్ర, గోపి పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

తల్లాడ: మండలంలోని నారాయణపురం కోదండ రామాలయం వద్ద శుక్రవారం తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేశారు. వీరిలో ఐదుగురికి బీపీ, షుగర్ నిర్ధారణ కాగా.. మరోసారి తల్లాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణరెడ్డి, సీతారామిరెడ్డి, పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

మధిర: మధిర మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలు, పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బెజవాడ రవిబాబు డిమాండ్ చేశారు. మధిర మున్సిపల్ వర్కర్ల యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) మహాసభను శుక్రవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. గత పాలకవర్గం, గతంలో పనిచేసిన అధికారుల నిర్లక్ష్యం వల్ల కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ఎండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను ఈ నెల చివరి వరకు చెల్లించాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ మధిర డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బెజవాడ రవి, అధ్యక్షులుగా చటారి నాగేంద్రం, కార్యదర్శిగా పుల్లూరి నరేష్, కోశాధికారిగా తగరం బాబు, కార్యవర్గ సభ్యులుగా గోవర్ధన్ రెడ్డి, సుందర్ రావు, బాబు, మార్తమ్మ ఎన్నుకున్నారు.

రైతులకు నష్టం జరిగితే ఊరుకోం



మాట్లాడుతున్న గోవిందరావు

బోనకల్: పాలకుల విధానాల వల్ల రైతులకు నష్టం వాటిల్లితే ఊరుకోబోమని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో రైతుసంఘం మూడో మండల మహాసభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏఐకేఎస్ జెండాను సీనియర్ నాయకుడు పారుపల్లి నరసింహారావు ఆవిష్కరించారు. అనంతరం మహాసభను ఉద్దేశించి గోవిందరావు మాట్లాడుతూ.. 1936లో స్వాతంత్ర్య సంగ్రామంలో రైతులను ఐక్యపరిచేందుకు ఏఐకేఎస్ ఏర్పడిందన్నారు. నాటి నుంచి నేటివరకు రైతాంగ సమస్యలపై ప్రభుత్వాలను నిలదీస్తూ పోరాటాలు నిర్వహిస్తూ హక్కులను సాధించుకుంటున్నాం అన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కొంగర భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా కలకోట గ్రామానికి చెందిన ఏలూరు పూర్ణచందర్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా పారుపల్లి నరసింహారావుతో పాటు 35మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు, పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్, ఆకెన పవన్, మరీదు వెంకటేశ్వర్లు, మాతంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు



వైరా: దీక్షను ప్రారంభిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ సీతారాములు



మధిర: నిరసన దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు



సత్తుపల్లిరూరల్: కొనసాగుతున్న దీక్షలు

● వైరా: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కలిపించే వరకూ ఎటువంటి ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యాన వైరా మండల కేంద్రంలో చేపట్టిన దీక్షలు శుక్రవారం మూడవ రోజుకు చేరుకోగా.. దీక్షా శిబిరాన్ని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు ప్రారంభించి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కోట కోటి, కలిసా రమేష్, ఎంకన్న, కంచర్ల వెంకటేశ్వర్లు, మాగంటి బాబూరావు, మోదుగు రమేష్, నారపోగు లక్ష్మణరావు, గద్దల కమలాకర్, ఎక్కిరాల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

● మధిర: మధిర తహసీల్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ శిబిరంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయమన్నారు. వర్గీకరణ జరిగేంతవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేకల రాజా, కొండూరు రాజేష్, మరపాక ఆశీర్వాదం, కనకపుడి పవన్, వెంకన్న, తడికమల్ల పుల్లయ్య, రామకృష్ణ, కాంతారావు, పార్వపు ఏసూక తదితరులు పాల్గొన్నారు.

● ఏన్కూరు: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యంగళ నరేష్ మాట్లాడగా.. కార్యక్రమంలో నాయకులు తంబర్ల వీరయ్య, కోట గణేష్, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● చింతకాని: స్థానిక తహసీల్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాల్గవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి రవీంద్ర మాట్లాడగా.. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి చాట్ల రాజేష్, దళితుల హక్కుల సమితి మండల అధ్యక్షుడు అంతోని రమేష్, ఎమ్మార్పీఎస్ మండల చిర్ర ఉపేందర్, నాయకులు కుక్కల దిలీప్, రాజశేఖర్, రవి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

● సత్తుపల్లిరూరల్: స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం మూడవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ గొల్లమండల ముత్తారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. దీక్షలో నాయకులు దువ్వూరు రమేష్, శ్రీనివాసరావు, లక్ష్మణ్, రాఘవ, నాగేశ్వరరావు, రాము, మేరీ, సుగుణ పాల్గొన్నారు.